క్లుప్తంగా

సైన్సు క్విజ్‌లో స్టేట్ లెవల్‌కు విష్ణునందన్


విష్ణునందన్ (ఫైల్)

కురిచేడు: కౌశల్–24 సైన్సు క్విజ్ పోటీల్లో స్టేట్ లెవల్‌కు స్థానిక వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి డి.విష్ణునందన్ ఎంపికయ్యారు. మండలస్థాయి నుంచి జిల్లా స్థాయికి, జిల్లా స్థాయి నుంచి స్టేట్ లెవల్‌కు విష్ణునందన్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీఎస్ఆర్ సాయి తెలిపారు. బాలుడిని హెచ్ఎం, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, ఎస్ఎంసీ చైర్మన్ టి.మల్లికార్జున, వైస్ చైర్మన్ షేక్ జాన్‌బీలు అభినందించారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ


నోట్ పుస్తకాలు అందుకుంటున్న విద్యార్థులు

దర్శి: మండలంలోని పోతవరం ప్రాథమిక పాఠశాలలో పూర్వ విద్యార్థి, హైదరాబాద్‌లో వ్యాపారం చేసుకుంటున్న కోరే బాలరంగ సాయి విద్యార్థులకు రూ.10 వేల విలువైన నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, క్రేయన్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇంటర్మీడియెట్‌లో తనకు క్లాస్‌మెట్ కూడా అని చెప్పారు. అప్పటి నుంచి మంచి సేవా భావం కలిగిన వ్యక్తి అని అన్నారు. పాఠశాలలో చదువుకున్నందుకు పుస్తకాలు ఇచ్చి రుణం తీర్చుకునే భాగ్యం కలగటం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో కూడా తన సహకారం ఉంటుందని చెప్పారు. మానవత సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాస రెడ్డి, బసంతి, రామారావు పాల్గొన్నారు.

ఈదర చెరువుకు వేలంపాట


వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని ఈదర చెరువు సర్వే నంబర్ 361/2లో 42 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దానికి అధికారులు బుధవారం వేలంపాట వేశారు. రూ.13 లక్షలకు నాగుమల్లి గురవయ్య పాడుకున్నాడు. మద్దతు ధర రూ.12 లక్షలు ఉండగా లక్ష రూపాయలు ఎక్కువకు పాడుకున్నాడు. 2024 సంవత్సరం నుంచి 2027వ సంవత్సరం వరకు మూడేళ్ల వరకు పాట చెల్లుబాటవుతుందని ఎంపీడీఓ జనార్దన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు.

పెట్టుబడి సాయానికి మంగళం

- అన్నదాత సుఖీభవ పథకాన్ని మర్చిపోయిన కూటమి ప్రభుత్వం
- పొలకులపై వివిధ రకాల పంటలు వేసిన రైతుల కన్నెర్ర
- నిండా మునిగామంటూ మండిపడుతున్న రైతులు

తాళ్లూరు:

ఖరీఫ్ సీజన్‌లో వరి, కంది, మొక్కజొన్న తదితర పంటలు మండలంలో సుమారు 8 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షం కారణంగా సుమారు 400 ఎకరాల్లో వరి, సుమారు 100 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు వర్షార్పణం అయ్యాయి. అధికారులు పంట నష్టంపై అంచనా వేసి నష్టపరిహారం మాత్రం చెల్లించ లేదు. రైతులకు కనీసం పెట్టుబడి సాయం అందించడంలో కూడా కూటమి ప్రభుత్వం విఫలమైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పథకం ద్వారా ఏటా సాగు సమయానికి నగదును రైతుల ఖాతాల్లో జమ చేసి వారికి అండగా నిలిచింది. టీడీపీ ప్రభుత్వంలో ఎలాంటి పెట్టుబడి సాయం అందించక


సాగుకు సిద్ధమవుతున్న భూమి

పోవడంతో రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం పెట్టి రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందిస్తామన్నారు. నేటికీ కార్యాచరణ జరగలేదు. పెట్టుబడి సాయం అందక.. చేసిన అప్పులు తీర్చలేక నష్టపోతున్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తామని ఇచ్చిన హామీ అధికారం చేపట్టి 6 మాసాలు అవుతున్నా నేటికీ నోరు విప్పక పోవడంపై రైతుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వాటి నడ్డి విరుస్తోంది. పంటల సాగు సమయంలో పెట్టుబడి సాయం అందించకుంటే ఎలాగని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు కాకుండా మిగిలిన రూ.7500లు రెండు విడతలుగా అందేవని రైతులు గుర్తుచేశారు. మొదటి విడతగా ఖరీఫ్ ప్రారంభం మే నెల్లో రూ.5500, రెండో విడతగా రబీ సీజన్ జనవరి మాసంలో రూ.2 వేలు జగన్ ప్రభుత్వం అందించిందని రైతులు గుర్తు చేస్తున్నారు. కొన్ని రోజులుగా మండలంలో కురిసిన వర్షానికి పంట నష్టం జరిగిందని, ప్రభుత్వం స్పదించి పరిహారం అందిచాలని రైతులు కోరుతున్నారు.

అప్పు చేసి రెండు ఎకరాల్లో జొన్న సాగు చేశా



మొక్క జొన్న పంట సాగుకు ఇది అదును కావడంతో అప్పు చేసి రెండు ఎకరాల్లో మొక్కజొన్నపంట సాగు చేశా. పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నా. ప్రభుత్వం స్పందించి రైతులకు పెట్టుబడి సాయం అందించాలి. గత ప్రభుత్వం రైతులను అన్ని రకాలుగా ఆదుకుంది.

– ఆర్.శ్రీనివాసులు, రైతు, మాదవరం

వర్షం వస్తుందేమోనని పంటను కోయించా



ఇటీవల మండలంలో కురుస్తున్న వర్షానికి పంట ఎక్కడ పూర్తిగా దెబ్బతింటుందేమోనని, పంట కోతకు రాక మునుపే మిషన్ సాయంతో కోత కోయించా. పెట్టుబడి పెరిగిన దరిమిలా ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తే బాగుంటుంది.

– ఎం.నారాయణరెడ్డి, రైతు

తెగుళ్లకు రూ.30 వేలు ఖర్చు చేశా



భారీ వర్షం కారణంగా వరి పంటకు తెగుళ్లు సోకాయి. ఇప్పటికీ రూ.30 వేలు ఖర్చు చేసి పలు రకాల మందులను పంటపై మూడు సార్లు పిచికారీ చేశా. ప్రభుత్వం సాయం అందించాలి. రైతులు అన్ని రకాలుగా నష్టపోయారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులు మేలు జరిగింది.

– డి.వెంకటేశ్వర్లు, రైతు, బెల్లంకొండవారిపాలెం

చేతికి రావాల్సిన పంట నేలపాలైంది



కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా చేతికి రావాల్సిన వరి పంట నేలకు వరిగి పూర్తిగా దెబ్బతింది. గాలులకు గింజ రాలిపోయి దిగుబడి తగ్గింది. తడిచిన పంటకు సరైన ధర లేదు. తగ్గించి అడుగుతున్నారు. ఇలాగైతే రైతులు అన్ని రకాలుగా నష్టపోవాల్సిందే.

– గుండా వెంకట రమణారెడ్డి, రైతు

అంగన్‌వాడీల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

పుల్లలచెరువు: మండలంలోని వివిధ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న కార్యకర్త, ఆయా పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ అధికారి పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో రెండు కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, రిజర్వేషన్ ప్రకారం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యకర్తల పోస్టులు ఎం.ఎర్రపాలెం (బిసి–డి), అక్కపాలెం (ఎస్టీ), ఆయా పోస్టుల కోసం ఎం.ఎర్రపాలెం (ఒసి), నరజాముల తండా (ఎస్టీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారు తమ దరఖాస్తులను ఈ నెల 23వ తేదీలోపు ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

భూవివాదాలు పరిష్కరించుకోవాలి

పుల్లలచెరువు: భూ వివాదాలు, భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బాలకిషన్ తెలిపారు. బుధవారం మండలంలోని మల్లాపాలెం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ భూ వివాదాలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. నిరంతరం భూ వివరాలను సెల్‌ఫోన్‌లో ఎప్పటికప్పుడు పరిశీలించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ కిరణ్, నాయకులు నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి


దొనకొండ: అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

దర్శి: నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ సూచించారు. రెవెన్యూ ప్రాంగణంలోని ఎస్టీటీ సమావేశం హాలులో ఎన్నికల అధికారులు, పీఓలకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ నీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ నమూనా 3–ఏను ఎన్నికల అధికారులు నిర్దేశించిన ముఖ్యమైన ప్రదేశాల్లో ప్రచురించాలని చెప్పారు. నిర్దేశించిన సమయం ప్రకారం ఈ నెల 14వ తేదీన పీఓలు, ఏపీఓలు వారికి కేటాయించిన ప్రాదేశిక నియోజకవర్గం (టీసీ) వారీగా హాజరు కావాలన్నారు. నిబంధనల ప్రకారమే ఆంధ్రప్రదేశ్ రైతుల సాగు నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు జరిపేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. అధ్యక్షులు, ఉపాధ్యక్షులు సాయంత్రం ఐదు గంటల్లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఏఓ బాలకృష్ణనాయక్, ఎంఈఓ కాకర్ల రఘురామయ్య, రమాదేవి ఏపీఓలు పాల్గొన్నారు.

పుల్లలచెరువు: ఈ నెల 14వ తేదీన జరుగనున్న నీటి సంఘాల ఎన్నికలు పక్కాగా జరిగేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బాలకిషన్ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు నియమించిన ఎన్నికల అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 11 నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. 14వ తేదీ ఉదయం టీసీల ఎన్నిక, మధ్యాహ్నం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు ఎన్నిక ఉంటుందని, నియమాలను అనుసరిస్తూ ఎన్నిక సక్రమంగా నిర్వహించాలన్నారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్న వాటిని మినహాయించి మిగిలిన సంఘాలకు బ్యాలెట్ ద్వారా ఎన్నికలు ఉంటాయని తెలిపారు. ఎన్నికల నిర్వాహణకు మండల స్థాయి అధికారులతో పాటు సచివాలయ సిబ్బందిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో వసంతరావునాయక్, ఏఈ చంద్రశేఖర్, ఏవో మరియదాసు పాల్గొన్నారు.

దొనకొండ: నీటి సంఘాల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేలా చూడాలని తహసీల్దార్ బి.రమాదేవి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నీటి సంఘాల ఎన్నికలపై ఇరిగేషన్ అధికారులకు, సర్వేయర్లు, వీఆర్ఓలు, మహిళా పోలీసులు, రెవెన్యూ, సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలో 11 ఇరిగేషన్ చెరువులు ఉన్నాయని, అందులో కొచ్చెర్లకోట పంచాయతీలో 4, గంగదేవిపల్లి పంచాయతీలో 2, రుద్రసముద్రం 1, రామాపురం 2, మల్లంపేట 1, ఆరవల్లిపాడు 1 చెరువులు ఉన్నాయన్నారు. ఆ చెరువుల కింద ఉన్న రైతులకు ఎన్నికల్లో పాల్గొనేందుకు అవకాశం ఉందన్నారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలు పాటించాలన్నారు. ఈ ఎన్నికల విషయమై గ్రామంలో దండోరా వేయించాలని తహసీల్దార్ సూచించారు. ఎంపీడీఓ ఎం.శ్రీదేవి, ఏఎస్ఓ ప్రసాద్, ఎస్ఐ కె.విజయ్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తాళ్లూరు: నీటిపారుదల వ్యవస్థలో ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, నీటి వినియోగదారుల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికకు అధికారులు సిద్ధం కావాలని తహసీల్దార్ సంజీవరావు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి పారుదల వ్యవస్థలో అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక నిష్పక్షపాతంగా జరగాలన్నారు. అధికారులు ఓటర్లకు పలు సూచనలు ఇవ్వాలని సూచించారు. ఎంపీడీఓ సుందరరామయ్య, డీటీ ఇమ్మానియేలు, ఏఓ ప్రసాదరావు, ఎంఈఓలు సుబ్బయ్య, సుధాకర్, ప్రశాంతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్


మాట్లాడుతున్న తహసీల్దార్ సంజీవయ్య


పుల్లలచెరువు: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ బాలకిషన్

వధూవరులకు బూచేపల్లి ఆశీర్వాదం


వధూవరులను ఆశీర్వదిస్తున్న డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి వివాహ వేడుకలకు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు హాజరయ్యారు. అక్షతలు వేసి వధూవరులను ఆశీర్వదించారు. వారికి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

కురిచేడు: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. స్థానిక ఎన్ఎస్‌పీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో కార్యకర్త పోస్టు ఓసీ జనరల్‌కు, రామాంజనేయ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టు ఎస్టీకి, ముష్టల్లగంగవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టు ఓసీ జనరల్‌కు, ఆవులమంద–1 అంగన్‌వాడీ కేంద్రంలోని ఆయా పోస్టు ఓసీ జనరల్‌కు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ నోటిఫైడ్ అంగన్‌వాడీ కేంద్రాలకు కార్యకర్తకు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, లేకుంటే 9వ తరగతి పరిగణనలోకి తీసుకుంటామని, 21 సంవత్సరాలు నిండిన అభ్యర్థులు లేకుంటే 18 సంవత్సరాల పైన వారికి ప్రాధాన్యం ఇస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు విద్యార్హత పత్రాలు, స్థానిక నివాస ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, వితంతువైతే భర్త మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలను ఐసీడీఎస్ ప్రాజెక్టు దర్శి కార్యాలయంలో ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అందజేయాలని అధికారులు పేర్కొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు


పుల్లలచెరువు: రైతులతో విస్తరణాధికారి


మునెయ్యతో మాట్లాడుతున్న తహసీల్దార్


దొనకొండ: కంది పంటను పరిశీలిస్తున్న ఏఓ


పెద్దదోర్నాలలో..


పెద్దారవీడు: శనగ పంట తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: శనగ పంటలో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి సూచించారు. మండలంలోని మద్దలకట్ట, సానికవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా మిరప, శనగ పంటలను పరిశీలించారు. శనగ పంటలో పచ్చ రబ్బరు పురుగు, మెరుపులు తెగుళ్లు గుర్తించారు. పచ్చ రబ్బరు పురుగు పచ్చ హరితాన్ని తిని నష్టం కలుగజేస్తుందని, పైరు తొలిదశలో ఎక్కువ ఆశించి నష్టపడుతుందని చెప్పారు. నివారణకు ఇండాక్సి కార్బ్ ఒక ఎంఎల్ లేక రైనాక్సిపైర్ 0.2 ఎంఎల్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. వేరుకుళ్లు తెగుళ్లు నీటి ఎద్దడి పరిస్థితిలో మరి ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడే ఈ తెగులు ఎక్కువ ఆశిస్తుందన్నారు. పూత, కాయ దశలో ఎక్కువ కనిపిస్తోందని, ఈ తెగులు వేర్లు నల్లగా మారి పూర్తిగా కుళ్లి పోతాయని, తల్లి వేర్లు తేలికగా ఊడిపోతుందని తెలిపారు. ఈ తెగులు నివారణకు పంట మార్పిడి పాటించకుంటే సకాలంలో వేసుకోవడం వల్ల పంట చివరి దశలో నీటి ఎద్దడికి మరియు అధిక ఉష్ణోగ్రతకు గురి కాకుండా చూసుకుంటే తెగులు తీవ్రతను తగ్గించవచ్చన్నారు. తెగులు నివారణకు 2 కిలోల ట్రైకోడెర్మా విరిడి, 10 కిలోల వేపపండి, 90 కిలోల పశువుల ఎరువులో కలిపి 10–15 రోజుల వృద్ధి చేసి పొలంలో చల్లుకోవాలని ఏఓ సూచించారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు: రబీలో సాగు చేసిన పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేసుకుని ఈ నెల 15వ తేదీ లోపు ఫసల్ బీమాకు దరఖాస్తు చేసుకోవాలని విస్తరణాధికారి గోపీకృష్ణ తెలిపారు. మండలంలోని చౌటపాచర్లలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రబీలో సాగు చేసిన ప్రతి పంటను ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. ఫసల్ బీమా పథకంలో ఉన్న పంటలైన శనగ, మినుము, మొక్కజొన్న, మిరప పంటలు వేసిన రైతులు ఈ నెల 15వ తేదీ లోపు సమీపంలోని సీఎస్‌సీ సెంటర్, మీ సేవా కేంద్రాల్లో పంట బీమా చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రాబోయే రెండు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున వరి పంట కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు.

పొలం దారి సమస్య పరిష్కారం

దొనకొండ: మండలంలోని సంగాపురం గ్రామానికి చెందిన గోగు మునెయ్య అనే రైతు పొలం దారి విషయంలో చాలా ఇబ్బంది ఎదుర్కొంటున్నాడు. దీర్ఘకాలికంగా సమస్య పరిష్కారం కాకపోవడంతో పొలానికి వెళ్లేందుకు దారి చూపించమని తహసీల్దార్ బి.రమాదేవిని అర్జీ రూపంలో కోరారు. పదేళ్ల నుంచి పొలం వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని, పొలం పనులు చేసుకోకుంటే జీవనాధారం కష్టంగా ఉంటుందని తహసీల్దార్‌కు విన్నవించారు. స్పందించిన తహసీల్దార్ గ్రామస్తులతో మాట్లాడి బుధవారం మునెయ్యకు పొలం దారి చూపించారు. గ్రామస్తులు, మునెయ్య తహసీల్దార్ రమాదేవికి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె వెంట సర్పంచ్ భీమిని వెంకటేశ్వర్లు, ఎస్ఐ కె.విజయ్ కుమార్, సర్వేయర్ సీహెచ్ వెంకట్రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మిరపలో జిగురు అట్టలు వాడాలి

దొనకొండ: రైతులు మిర్చి పంటలో జిగురు అట్టలు పెట్టి కుచ్చు తెగులు రాకుండా చూడాలని ఉద్యానవన అధికారి రమేష్ సూచించారు. బుధవారం మంగినపూడి, భూమనపల్లి గ్రామాల్లో ఆయన మిరప పంటను సందర్శించి రైతులకు సూచనలు, సలహాలు అందించారు. మిరప పంటకు కుచ్చు తెగులు రాకుండా నివారించేందుకు నీలం రంగు జిగురు అట్టలను ఎకరాకు 30 ఏర్పాటు చేయాలన్నారు. వీటితో తెల్ల దోమ, తామర పురుగులు అతుక్కుని చనిపోతాయన్నారు. వర్షాలకు ఉద్యాన పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కంది పంటలో తుట్టె పురుగు, శనగ పచ్చ పురుగు నివారణ చర్యలు వివరించారు. సాగర్ ఆయకట్టు కింద రైతులు వరి కోతలను వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికల దృష్ట్యా వాయిదా వేసుకోవాలని ఏఓ కోరారు. సిబ్బంది రాధిక, వెటర్నరీ అసిస్టెంట్ మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండల పరిధిలోని ఐనముక్కల, హసానబాద్ గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించి కంది, మినుము పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఏఈఓ చైతన్యకుమార్, శివానాయక్, సుస్మిత, గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

తాళ్లూరు: మండలంలోని లక్కవరం, దోసకాయలపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ ప్రసాదరావు మాట్లాడుతూ సాధారణ వరి, నారుమడుల్లో ఇనుప ధాతులోపం కనిపిస్తోందని, దీంతో లేత చిగురాకులు తెల్లగా మారి ఉధృతం ఎక్కుగా ఉన్నప్పుడు ఇటుక రంగు మచ్చలు వచ్చి ఆకు నిర్జీవంగా తయారవుతుందన్నారు. తగు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వీఏఏ వీరాంజనేయులు పాల్గొన్నారు.

రైతులను దగా చేస్తున్న ప్రభుత్వంపై నిరసన తెలుపుదాం

యర్రగొండపాలెం: రైతులను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వంపై నిరసన గళం వినిపించేందుకు ఈ నెల 13వ తేదీన జిల్లా కేంద్రం ఒంగోలులో జరిగే ర్యాలీలో పాల్గొనేందుకు ప్రతి గ్రామం నుంచి ప్రజలు, రైతులు భారీ ఎత్తున తరలిరావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, జిల్లా రైతు సంఘం నాయకుడు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి బుధవారం కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ, అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ బృహత్తరమైన కార్యక్రమంలో రైతులు, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు పాల్గొనేందుకు నడుం కట్టాలని వారు కోరారు.

పేరుకున్న నిర్లక్ష్యం


ఇళ్ల మధ్య పేరుకున్న వ్యర్థాలు

పుల్లలచెరువు: మండలంలోని ముటుకుల ఎస్సీ కాలనీలో ఇళ్ల మధ్య, ప్రధాన రహదారి పక్కన వ్యర్థాలు కుప్పలుగా పెరుకుపోయాయి. వ్యర్థాలను తొలగించక పోవడంతో దుర్వాసన, దోమల బెడదతో అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి గమనించి పంచాయతీ కార్యదర్శి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పశువుల షెడ్‌లు నెలాఖరులోగా పూర్తి చేయాలి


మాట్లాడుతున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

దర్శి: పశువుల షెడ్‌లు నెలాఖరులోగా పూర్తి చేయాలని నీటి యాజమాన్య సంస్థ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జోసఫ్ కుమార్ సూచించారు. దర్శి క్లస్టర్‌లోని అన్నీ మండలాల ఏపీఓలు, ఈసీలు, టీఏలు, సీఓలు, బీఎఫ్‌టీలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ మండలాల్లో మిషన్ అమృత్ సరోవర్ 2.0 కింద షెడ్‌లు నిర్మించేందుకు స్థలాలు గుర్తించాలని సూచించారు. పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. షెడ్‌ల నిర్మాణాలు పూర్తిస్థాయిలో నిబంధనలను అనుసరించి ఉండాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టర్ డైరెక్టర్ ఆర్.లలితకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.